

# భవానీద్వీపం

–వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహాలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 61 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

భవానీద్వీపం చెవులు రిక్కించి వింటున్నట్లు వున్నది. ఆ ప్రశాంతమైన ప్రకృతిలో సమర్ధరాముడి కంఠం ఒక్కటే చెవులకు సోకుతున్నది కృష్ణరాయలకు. అదొక వర్ణనాతీతమైన అనుభూతి. కంటికి కనిపిస్తున్న జన్మజన్మల కథల దృశ్యాలు, చెవులకు వినిపిస్తున్న సంభాషణలు ఒకప్రక్కన, తన శరీరపు స్పృహ ఒకప్రక్కన తెలుస్తూనే వున్నాయి. రంగస్థలం మీద రసవత్తరమైన నాటకం చూస్తున్నట్లు వున్నది. పాత్రలు కనిపిస్తున్నాయి. పలుకులు వినబడుతున్నాయి. మరలా ప్రేక్షకుడిగా, శ్రోతగా తన ఉనికి కూడా తనకు విడిగా ప్రత్యేకంగా తెలుస్తున్నది. ఒక మౌన సాక్షిగా గమనిస్తున్నట్లు తనకే తెలుస్తున్నది.

మనసులో ఎక్కడో ఏ అడుగుననో మెదిలిన ప్రశ్నలకు ఆకాశవాణిలా సమర్ధరాముడి కంఠం సమాధానం చెబుతూనే వున్నది. ఇప్పటికి కృష్ణరాయలకు కలిగిన చాలా సందేహాలకు సమాధానాలు లభించాయి.

మంత్రించిన భస్మం కారణంగా శ్రీవిద్యాపూర్ణుడిపై మోహపడిన తక్షక నాగిని, ఆ నాగినిని కామించి, శ్రీవిద్యాపూర్ణుడిపై పగబట్టిన మగసర్పం జన్మ జన్మలుగా వదలకుండా శ్రీవిద్యాపూర్ణుడిని వెంబడిస్తున్నాయి!

శ్రీవిద్యాపూర్ణుడు నాగుమయ్యగా జన్మించినపుడు నాగకన్య సంపంగిగా జన్మించింది. భంగపడిన మగ సర్పం నాగుమయ్యకు అన్నగా, నాగభూషణుడిగా వెంటాడింది. సంపంగిని కబళించడానికి ప్రయత్నం చేసింది.

'శ్రీవిద్యాపూర్ణుడు కృష్ణమయ్యగా జన్మించినపుడు ఆ నాగకన్య మోహనాంగిగా జన్మించింది. కానీ..కానీ..

మోహనాంగిగా ఆమె కృష్ణమయ్యను ఎలా లొంగదీసుకో గలిగింది? గత జన్మలలో అంతటి మహా సాధకుడు అంత కట్టుబానిసగా వెలయాలి యింటిముందు పడి వున్నాడా?' చటుక్కున మెరుపులా ప్రశ్న మెదిలింది కృష్ణరాయల మనసులో.

మరుక్షణమే చిరునవ్వుతో సమర్థ రాముడి కంఠం వినిపించింది కలలోలాగా. 'రాయగా రాయగా రాతిమీద కూడా గుర్తులు పడతాయి కృష్ణోబా! సాక్షాత్తూ కైలాస శంకరుడి అవతారమైన ఆదిశంకరుడే అమరుక మహారాజు శరీరంలో ప్రవేశించినపుడు మోహానికి గురికాలేదూ?' 'నిజమే కదా!' అనుకున్నాడు కృష్ణరాయలు తనలో తను.

సమర్థుడి కంఠం మరలా తీయగా మ్రోగింది. 'నెమ్మదిగా మనసు చలించడం మొదలై మనసులో సంఘర్షణ కలగడం వలననే శ్రీవిద్యాపూర్ణుడికి అలా స్వప్నంలో కనిపించింది కృష్ణోబా! ఆ అవయవ సౌందర్య వర్ణన అంతా అమ్మ సౌందర్యవిలాసాతిశయ వర్ణనమే కృష్ణోబా! కంటితో చూసినవి, చెవులతో విన్నవి మనసు పొరలలో అడుగున పేరుకుపోయిన కోరికలకు రూపంగా స్వప్నాలలో దర్శనమిస్తాయి కృష్ణోబా!

కొన్ని సందర్భాలలో భవిష్య దర్శనాలు కూడా స్వప్నాలలో కలుగుతాయి.

'తీవ్రమైన ఉపాసనా మార్గంలో అమ్మ పెట్టే పరీక్షలు అందగత్తెల రూపంలోనే వచ్చిపడతాయి కృష్ణోబా! ఎంతటి సాధకుడైనా సంఘర్షణకు గురి అవుతాడు. తట్టుకున్నవాడు నిలబడతాడు. ముట్టుకున్నవాడు తడబడతాడు. పడిపోతాడు. పతితుడౌటాడు.

'నాగుమయ్యగా సంపంగిని కూడా మనసులో ఇష్టపడ్డాడు. భుజం మీద ఆమెను మోస్తూ ఆమె శరీర స్పర్శను ఆనందించాడు. దానిని అణచుకోడానికి విఫల ప్రయత్నం కూడా చేశాడు. పట్టు పీతాంబరమైనా వాడినకొద్దీ దాని వన్నె తరుగుతుందికదా కృష్ణోబా! అందుకే కృష్ణమయ్యగా మోహనాంగికి వశుడైపోయాడు. నాగుమయ్యకు తండ్రి చనిపోతూ చెప్పినమాట విన్నావు కదా కృష్ణోబా ! ఎన్నడూ ఏ పామునూ చంపవద్దు, చంపుతుంటే చూడను కూడా చూడ వద్దు అని!'

'ఔను' అనుకున్నాడు కృష్ణరాయలు మనసులో.

'ఆ కారణంగానే పుట్టుగుడ్డిగా జన్మించాడు. వారి యిలవేలుపు నృసింహుడు కనుక ఆ నృసింహుడే సాధువుగా బాలకుడిని రక్షించి సింహాచలంలో తన కొలువుకు చేర్చుకున్నాడు'

'అయితే..' అని ప్రశ్నించబోయి ఆగిపోయాడు కృష్ణరాయలు. 'ఎందుకు సంశయం కృష్ణోబా? ఆగిపోయావేం?

అడుగు! ఈ జన్మలో పగతో కృష్ణమయ్యను, మోహనాంగిని వెన్నాడలేదా ఆ మగసర్పం? అదేకదా నీ ప్రశ్న?'

సమర్థుడి కంఠంలో చిరునవ్వు ధ్వనిస్తున్నది. ఆ స్థితిలో కూడా ఆశ్చర్యం కలిగింది కృష్ణరాయలకు. మౌనం వహించాడు.

'తన అన్నకు పాండవుల గుట్టమీద బిలంలో మంత్రబంధనం చేసి, ఏటేటా శాంతి జరిపాడు కదా నాగుమయ్య!

'మనిషిగా జన్మించి నాగమణిని మింగి, అది శరీరంలో కలిసిపోయిన కారణంగా సర్పమై ఆ బిలంలోనే పడివున్నాడు. ఇక బయటపడలేడు' అని నాగుమయ్య చెప్పిన మాటలను మరిచిపోయావా కృష్ణోబా?' వెక్కిరింపుగా అడిగాడు సమర్థుడు.

పాండవుల గుట్టమీద సంపంగిని రక్షించి వెనక్కు తిరిగి వస్తున్నప్పుడు శివయ్య అనే వృద్ధుడితో నాగుమయ్య అన్నమాటలు గుర్తుకొచ్చాయి కృష్ణరాయలకు. 'పెద్ద బాబు కాదు, పెద్ద పాము!' .. ' ఇక బిలంనుండి బయటకు రాలేడు. పడగశిల దిగబడి బిలం మూసుకుపోయింది. అందులోనే వుంటాడు. ఎన్నాళ్ళో, యెన్నేళ్ళో' అంటూ బాధగా నుదురు పట్టుకున్న నాగుమయ్య రూపం కనులముందు మెదిలింది కృష్ణరాయలకు.

'ఆ బిలంలోనే ఆడనాగులతో క్రీడిస్తూ కాలధర్మం చెందాడు పూర్తి సర్పంగా మారిన నాగుమయ్య అన్న. మరలా నీ మీది పగతో నిన్ను అంతం చేయడానికి ప్రత్యక్షమయ్యాడు ఆ తక్షక నాగపురుషుడు. కొద్ది రోజులక్రితం నీమీద పడగ విసిరిన మహా సర్పం అతడే! ఆ సర్పాన్ని అడ్డగించి నిన్ను రక్షించినది ఆ నాగకన్యయే!'

'మోహనాంగిగా నీమీది జన్మ జన్మల మోహాన్ని తీర్చుకున్నది ఆ నాగకన్య. ఇక ఆమె నీడలా నిన్నూ నీ వంశాంకురాలనూ వెన్నంటి వుండి రక్షించాలనే ప్రయత్నిస్తుంది. ఒకరికి నిన్ను పొందడం వలన నీ మీది కామం తీరిపోయింది కృష్ణోబా. మరొకరికి నీ మీది పగ జ్వాలలా జన్మ జన్మల పర్యంతమూ రగులుతూనే ఉన్నది!'

ఒక్కసారిగా ఒళ్ళు ఝల్లుమన్నది కృష్ణరాయలకు. ఈ శరీరంలో ఎందరెందరు మహాపురుషుల అంశ, వాసన వున్నది! అనుకున్నాడు సంభ్రమంగా. వర్ణించలేని మహదానందం కలిగింది. మరుక్షణమే మరొక సంశయం

కలిగింది. ఆవేదన కలిగింది. 'నా మీద ఇంకా ఎంతకాలం ఆ పగ? మీరూ కట్టడి చేయలేని శత్రువు వున్నాడా స్వామీ?' ఆర్తిగా ప్రశ్నించాడు గురుదేవుడిని.

మౌనం వహించి, కొంతసేపటికి బదులు పలికాడు సమర్థుడు. 'అంతా రఘువీరుడి ఆట కృష్ణోబా! బొమ్మలాటలో బొమ్మలం! వీడొక పెద్ద బొమ్మ, నువ్వొక చిన్న బొమ్మ, అంతే! స్వామి కరుణతో జరిగినది, జరుగుతున్నది తెలుసుకున్నావు కృష్ణోబా! ఇక జరుగబోయేది చూద్దువుగాని! ఏమి చూసినా నువ్వు దుఃఖానికి లోను కావు. ఇది రామశాసనం! మహాబలి దయతో కేవలం సాక్షిగా సర్వమూ చూసి, విని తెలుసుకుంటావు. ఏ రాగ ద్వేషాలు, సుఖ దుఃఖాలులేని స్థిత ప్రజ్ఞ నీకు లభించుగాక!' నెమ్మదిగా నీటి వాలున అంతకంతకూ దూరమైపోతున్న సరంగు గొంతులా వినిపిస్తున్నది సమర్థుడి కంఠం.

మరలా ఒక తీయని మత్తు కమ్ముకున్నది కృష్ణరాయలకు. మనసుకు చెప్పలేని హాయిగా ఉన్నది. వేరే ఏ ధ్యాసా లేకుండా దుర్గమ్మ గుడి గంటలు వింటూ, కృష్ణమ్మ పరుగులు కంటూ తీరంలో ఇసుక తిన్నెల మీద కూర్చున్నట్లు ప్రశాంతంగా వున్నది. మాటలలో వర్ణించలేని ఒక చల్లదనం నిలువెల్లా అలుముకున్నది కృష్ణరాయలకు. కనులముందు చిరపరిచితమైన పరిసరాలు, మహలు కనిపించాయి.

★★★★★★★★★★★★★★

పాఠకుడా! పదిసంవత్సరాలు ముందుకు తీసుకుపోతాను. రా! వస్తావా? రా! రా! ఎవరికీ ఈ అదృష్టం పట్టలేదు గతంలో! వేలసంవత్సరాల కథలను, వ్యధలను, దృశ్యాలను, రహస్యాలను నేనెవరికీ విడమర్చలేదు గతంలో. కాలపు పొరలమాటున చరిత్ర మాళిగలో నిక్షిప్తం చేసిన ఆ రహస్యాలను వెల్లడి చేయకుండ, వంచించడం ఇక భావ్యం కాదు! రా! కాలమనే పాత్రలో చరిత్రను పవిత్ర మధువుగా చేసి ఒంపుతాను. తనివితీరా త్రాగుదువుగాని రా! యిది చరిత్రం! యిది పవిత్రం! యిది సంశయలతా లవిత్రం!

ముళ్ళను విరిచిన పూల కథ యిది! పులులను మట్టికరిపించిన లేగదూడల చరిత్ర ఇది! కార్చిచ్చును కాలరాచిన కడిమిపూల కథ ఇది! విను!

రా!

★★★★★★★★★★★★★★

క్రీ.శ. 1687

'నమస్సులు! దయచేయండి!' అంటూ సాదరంగా చేతులు జోడించి ఆహ్వానించాడు కృష్ణరాయలు.

'వేల్కొమ్' (స్వాగతం) అంటూ ఎదురేగి అతిథికి నమస్కరించాడు దామోదర శర్మ. గుఱ్ఱం కదలకుండా సున్నితంగా దాని నుదురుమీద రాస్తూ, కళ్ళాలను పట్టుకున్నాడు.

చెంగున దూకినట్లుగా గుర్రం మీదినుండి దిగాడు అతిథి. 'హోయ్! డాగ్' అంటూ డచ్చి భాషలో పలకరింపుగా నవ్వాడు. మరిచిపోయాను అన్నట్లు నాలుక కరుచుకున్నాడు వెంటనే. 'నమష్కారం' అంటూ విచిత్రమైన ఉచ్చారణతో చేతులు జోడించాడు. గుర్రం జీనుకున్న ఒరనుండి తన తుపాకీని అందుకుని ముందుకు అడుగేశాడు. తల ఎత్తి గంభీరంగా విశాలంగా వ్యాపించి ఉన్న భవంతిని కలయజూస్తూ 'మాజేస్టుయస్' అంటూ మెచ్చుకోలుగా గూడలు ఎగరేశాడు.

'నీం ఆల్షెబ్లీట్ ప్లాట్స్' (దయచేసి కూర్చోండి) అంటూ సగౌరవంగా అతిథిని ఉన్నతమైన ఆసనంలో కూర్చోబెట్టాడు దామోదరశర్మ.

అదేమీ మొదటిసారి కాదు 'ఆంజెలా అంబ్రాస్' ముత్తవరం రావడం, కృష్ణరాయల మహలును సందర్శించడం.

ఎన్ని వీర పోరాటాలను చూసింది ఆ మహలు! ఎందరు అవతార పురుషుల పాద స్పర్శతో పునీతమైంది! ఒళ్ళు గగురుపొడిచే ఎన్ని కథలకు శ్రోత అయ్యింది! ఆ చరిత్ర అంతా కథలు కథలుగా విన్నాడు అంబ్రాస్. నాగులవంచ కోటకు వచ్చిన మరునాడే కోటలో పనిచేసే పనివాళ్ళు కథలు చెప్పుకుంటుంటే విన్నాడు. వాళ్ళు దేని గురించి అంత అబ్బురంగా కళ్ళు పెద్దవి చేసి, ఒళ్ళు పులకరిస్తూ చెప్పుకుంటున్నారు అని అడిగాడు దామోదరశర్మను.

దామోదర శర్మ నాగులవంచ డచ్చివారి కోటలో దుబాసీగా కొలువు చేస్తున్నాడు. కోటలోవారికీ, వూరివారికీ ఆయన నడిచే నిఘంటువు! సంస్కృతం, అరబిక్, ఫ్రెంచి, స్పానిష్, ఇటాలియన్, డచ్చి, ఆంగ్లం, చైనీస్, రష్యన్ యిన్ని భాషలలో ఆయన పండితుడు అని తెలిసి 'ఓ! గెలీర్డ! గెలీర్డ!' (ఆహా పండితుడు! పండితుడు) అని 'ఇక్ గ్రూట్ యూ' (మీకు నమస్సులు తెలుపుతున్నాను) అని వారి సంప్రదాయం ప్రకారం ప్రణామం చేశాడు.

'గాడ్ జేగ్నె య'(పరమాత్ముడు మిమ్ములను ఆశీర్వదిస్తాడు) అని చిరునవ్వులు చిందించాడు దామోదర శర్మ.

అంతే! ఆనాటినుండి దామోదరశర్మకు శిష్యుడైపోయాడు అంబ్రాస్. బందరు నుండి గోల్కొండ వెళ్ళే రహదారిలో ముఖ్యమైన వ్యాపార కేంద్రం నాగులవంచ. స్తంభాద్రికి దక్షిణంగా పన్నెండు మైళ్ళ దూరంలో వున్నది. అప్పటికి దాదాపు రెండుదశాబ్దాల నుండీ డచ్చివారికి దక్షిణభారతంలో ప్రధానమైన వ్యాపారకేంద్రంగా వున్నది నాగులవంచ. నాగులవంచ నేతగాళ్ళ చేతులలో రూపు దిద్దుకున్న నాణ్యమైన వస్త్రాలు డచ్చివారి ఓడలలో తీరాలు దాటి దూర దూర పశ్చిమ దేశాలలో పేరుమోశాయి.

నాగులవంచ తీయమామిడిపళ్ళతో మొదలైంది డచ్చివారి వ్యాపారం. నేతగాళ్ళ నైపుణ్యం మీద కన్ను పడ్డది తరువాత. అక్కన్న మాదన్నల ప్రాపకం లభించింది వారికి. డచ్చివారి విలువైన నజరానాలు, అక్కన్న మాదన్నల సిఫారసులు గోల్కొండ సామ్రాజ్యంలో డచ్చివారికి సురక్షితమైన నెలవును చూపాయి. చిన్న చిన్నగా రైతులు, వ్యవసాయ భూములు, మగ్గాలు, నేతగాళ్ళు, పత్తి బేళ్ళు, చుట్టుపక్కల ఊళ్ళు డచ్చివారికి దాసోహమన్నాయి.

నాగులవంచ ప్రాంతంలో విరివిగా పెరిగే నీలిగోరింట మొక్కలు నాణ్యమైన నీలిరంగు అద్దకానికి పేరు మోశాయి. నీలిగోరింట మొక్కలను నీళ్ళలో నానబెట్టి, వడకట్టి, ముద్దలుగా చేసి వస్త్రాలకు అద్దకం చేయడం కోసం నాగులవంచ కేంద్రంగా చుట్టుపక్కల పాతిక మైళ్ళలో వేల నీలి తొట్లు వెలిశాయి.

ఒకరి తర్వాత ఒకరుగా వచ్చిన అధికారుల చేతులలో నాగులవంచ డచ్చివారి వర్తక స్థావరంగా మొదలై వర్తక సామ్రాజ్యం అయ్యింది. నియంతృత్వం మొదలైంది. రైతులు బానిసలుగా మారారు. దోపిడీ మొదలైంది. ఆలోచనల ప్రవాహంలో చిగురుటాకులా మనసు కొట్టుకుని పోతున్నది కృష్ణరాయలకు. కనులముందు మెదిలిన జ్ఞాపకం మనసును కకావికలు చేసింది.

పదునైన విచ్చుకత్తులు, గండ్రగొడ్డళ్ళు గాలిలో మెరిశాయి! విలువైన వజ్రాలు పొదిగిన తలపాగాలు, బంగారు కుండలాలు ధరించిన తలలు రెండు రక్తాన్ని చిమ్ముతూ బంతులలా ఎగిరిపడ్డాయి. మేలిమి బంగారు జరీ చేసిన వస్త్రాలతో మొండాలు నేలమీద పడి రక్తం మడుగు కడుతున్నది. కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ మొండాలు ఎగిరిపడుతున్నాయి!

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS